ప్రజాశక్తి

సోమవారం 23 అక్టోబర్ 2023 | 8 పేజీలు | ఎన్‌టిఆర్ | కృష్ణా



ఆదివారం దుర్గాదేవిగా దుర్గమ్మ

నేడు రెండు అలంకారాలు

- ఉదయం శ్రీ మహిషాసురమర్థిని, మధ్యాహ్నం శ్రీ రాజరాజేశ్వరిదేవిగా దుర్గమ్మ
- కృష్ణానదిలో తెప్పోత్సవానికి ఏర్పాట్లు పూర్తి
- నేటితో ముగియనున్న దసరా శరన్నవరాత్రులు

ప్రజాశక్తి-వన్‌టౌన్, విజయవాడ అర్బన్

దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా తొమ్మిదో రోజైన సోమవారం ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ రెండు అలంకారాల్లో యాత్రికులకు దర్శనమివ్వనుంది. ఉదయం శ్రీ మహిషాసురమర్థినీ దేవిగా, మధ్యాహ్నం నుంచి శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అలంకరించనున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం పూర్ణాహుతి అనంతరం సాయంత్రం గంగా పార్వతీ సమేత (మిగతా 6లో)

క్యూలైన్లలో యాత్రికులు



తెప్పోత్సవానికి సిద్ధంగా ఉన్న హంస వాహనం

బియ్యం అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు

- వచ్చే నెల నుంచి కందిపప్పు, పంచదార సరఫరా
- కృష్ణాజిల్లా డిఎస్‌ఒ పార్వతి

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

అక్టోబర్ నెలలో పంపిణీ గడువు పొడిగించి జిల్లాలో 87 శాతం మంది లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేసినట్లు కృష్ణాజిల్లా సివిల్ సప్లయ్ ఆఫీసర్ (డిఎస్ఓ) వి.పార్వతి తెలిపారు. నవంబర్ నెల నుంచి లబ్ధిదారులకు బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార రాయితీపై అందించనున్నట్లు చెప్పారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆమె ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వివరించారు.

ప్రశ్న: తెల్లరేషన్ రేషన్ కార్డులు ఎన్ని ఉన్నాయి? రేషన్ పంపిణీకి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో మొత్తం 5,33,424 తెల్లరేషన్ కార్డులున్నాయి. నేషనల్ ఫుడ్ సేఫ్టీ కార్డులు 1,53, 048, అంత్యోదయ అన్నయోజన (ఎఎవై) కార్డులు 30,533 ఉన్నాయి. 1059 రేషన్ దుకాణాలకు సంబంధించి 336

ఎండియు వాహనాల ద్వారా లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 17వ తేదీ వరకు రేషన్ పంపిణీ అవుతోంది. అక్టోబర్ నెలలో పంపిణీ గడువు పొడిగించాం.

ప్రశ్న: అక్టోబర్‌లో రేషన్ పంపిణీలో సర్వర్ సమస్యలు పరిష్కరించారా? ఎందరు

లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేశారు?

ఈ నెలలో రేషన్ పంపిణీ మొదలయిన ఐదు రోజుల తర్వాత సర్వర్ సమస్యలు వచ్చాయి. ఉన్నతాధికారులు డేటా సెంటర్‌లో సమస్యను పరిష్కరించారు. లబ్ధిదారులందరికి రేషన్ అందించేందుకు రేషన్ బియ్యం పంపిణీ గడువు పెంచాం. అక్టోబర్ నెలలోనూ 4 లక్షల 63 వేల మందికిపైగా రేషన్ బియ్యం అందాయి. 87 శాతం కార్డుదారులకు రేషన్ బియ్యం పంపిణీ అయ్యాయి.

ప్రశ్న: తెల్లకార్డుదారులకు రాయితీపై కందిపప్పు, పంచదార అందుతున్నాయా?

రేషన్ లబ్ధిదారులకు నవంబర్ నెల నుంచి కందిపప్పు, పంచదార రాయితీపై (మిగతా 6లో)

150 మందికి వైద్య పరీక్షలు

పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - నందిగామ : ఉచిత ఆర్థోపెటిక్ వైద్య శిబిరం ఆదివారం నందిగామ రైతుపేట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి మందిరంలో నిర్వహిం చారు. నందిగామ ఎంఎల్‌ఎ మొండితోక జగన్మోహన్‌రావు పాల్గొని జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్ మోకాలు నడుము కీళ్ళ మెడ, అన్ని రకాల నొప్పులు పరీక్షించారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారుగా 150 మంది రోగులు పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ వైద్య శిబిరంలో రూ.2 వేల విలువచేసే ఎముకల పట్టుత్వం మందులు ఉచితంగా చేశారు. నందిగామ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ యు.వాసుదేవరావు, డా.బొందలపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు వికలాంగులకు దుప్పట్లు వితరణ

దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గంపలగూడెం: వృద్ధులు, వికలాంగులు, వితంతువులు వెరసి 60 మందికి దుప్పట్లు ఆదివారం వితరణగా అంద జేశారు. కనుమూరు గ్రామానికి చెందిన అత్తునూరి వెంకట శివారెడ్డి తన నివాసమందు తల్లి అన్నపూర్ణమ్మ జ్ఞాపకార్థంగా వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

రంగా విగ్రహానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ మొండితోక జగన్మోహన్ రావు

ప్రజాశక్తి కంచికచర్ల : కంచికచర్ల మండలం చెవిటికల్లు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా విగ్రహ నిర్మాణానికి నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండి తోక జగన్మోహన్‌రావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరంలో పేద ప్రజల అభ్యున్నతికి రంగా చేసిన సేవలను కొనియాడారు. కేవలం 3 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉంటేనే లక్షలాది మంది ప్రజల హదయాల్లో చిర స్తాయిగా నిలిచాడన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెలగలేటి మాధవి, గ్రామ సర్పంచ్ బుడ్డి విజయలక్ష్మి, సొసైటీ ఛైర్మన్ మంగిశెట్టి పుల్లారావు, నాయకులు సింగం శెట్టి సురేష్, ప్రసాద్, వెలగలేటి బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయానికి శంకుస్థాపన

జగ్గయ్యపేట: మండలంలోని రామచంద్రునిపేట గ్రామంలో ఆదివారం పంచాయతీ కార్యాలయానికి ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దుల రామకృష్ణ, రాయల చిన్న పిచ్చయ్య, యర్రంశెట్టి చిన్న తిరుపతిరావు, పుట్టం అనంతరాములు, ఆరెగడ్డ పెద్ద వెంకయ్య, ముళ్ళపాటి ప్రసాద్, చుక్కా బాబు తదితర గ్రామ నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సామినేని

ప్రజా రక్షణ భేరి సభను జయప్రదం చేయండి: సిపిఎం

మైలవరంలో ప్రజా రక్షణ భేరి లోగో ప్రదర్శిస్తున్న నాయకులు

కంచికచర్లలో మాట్లాడుతున్న కళ్యాణ్

ప్రజాశక్తి - మైలవరం : అసమానతలు లేని ఆంధ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దాలని కోరుతూ నవంబర్ 15వ తేదీన విజయవాడలో జరిగే సిపిఎం ప్రజారక్షణ బేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ప్రజారక్షణ బేరి లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ కట్టడంలో వైసిపి, టిడిపి, జనసేనలు విఫలం చెందాయి అన్నారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేసేది సిపిఎం పార్టీ అని ప్రజలందరూ ఆలోచన చేసి సిపిఎం పార్టీని ఆదరించాలన్నారు. నవంబర్ 4వ తేదీ నుండి 9వ తేదీ వరకు మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, రెడ్డిగూడెం మండలాల్లో జరిగే బైక్ యాత్రను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎంమైలవరం, ఇబ్రహీంపట్నం, గొల్లపూడి రూరల్, జి కొండూరు మండలాల కార్యదర్శులు ఆర్ రమేష్ బాబు, ఎం మహేష్, టి నరసింహారావు పాల్గొన్నారు.

కంచికచర్ల : కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో వైసీపీ, టిడిపి, జనసేన పార్టీలు పూర్తిగా వైపల్యం చెందాయని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట కళ్యాణ్ విమర్శించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం సిపిఎం, సిఐటియు ప్రజా సంఘాల సమావేశం పార్టీ నాయకులు బెజ్జం భూషణం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళ్యాణ్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యాసర వస్తువులు ధరలు ఆకాశానికి అంటుతున్నాయని పేర్కొన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కఠారపు.గోపాల్ మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ ఛార్జీలు గ్యాస్ సిలిండర్ల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. నవంబర్ 15న జరిగే సిపిఎం బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జాహిదా, మాదవ, పాల్గొన్నారు.

బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలి

జాన్ సునంద్‌కు ధృవీకరణ పత్రాన్ని అందిస్తున్న పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు షేక్ నవాబ్ జానీ

ప్రజాశక్తి - నందిగామ : విజయవాడ కార్పొరేషన్‌లో పనిచేయుచున్న ఉపాధ్యాయులకు బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలని పిఆర్టియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు షేక్ నవాబ్ జానీ డిమాండ్ చేశారు. ఆదివారం పిఆర్‌టియు కార్యాలయంలో విజయవాడ అర్బన్ యూనిట్ కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. నవాబ్ జాని మాట్లాడుతూ విజయవాడ కార్పొరేషన్‌లో 15 సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టలేదని, చాలా పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులు లేవని అన్నారు. వెంటనే రేషనైజేషన్ నిర్వహించి విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు టీచర్ల కొరత ఉందని వెంటనే ఎస్జీటీ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న బదిలీలను కౌన్సెలింగ్ పద్ధతిలో మాత్రమే చేపట్టాలని, ఉపాధ్యాయుల పిఎఫ్ అకౌంట్ లోగల అవకతవకలను సరి చేయాలని, పిఎఫ్ అకౌంట్ లేని ఉపాధ్యాయులకు వెంటనే పిఎఫ్ నంబర్లు కేటాయించాలని కోరారు. అనంతరం విజయవాడ నగర శాఖ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా పి.జాన్ సునంద్, ప్రధాన కార్యదర్శిగా కె.వి.జయరాం ప్రసాద్‌లతో పాటు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పరిశీలకులుగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కొత్త హరి శరణ్, ఎన్నికల అధికారిగా రాష్ట్ర కౌన్సిలర్ గంటా సత్యం వ్యవహరించారు. జిల్లా నాయకులు కే యం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోయిన పొలాల పరిశీలన

ఎండిన పంటను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరుమండలంలో ఉన్న అన్ని చెరువులను సాగరుజలాలతో నింపి ఎండుతున్న పంటలను కాపా డాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మునకుళ్ళ గ్రామంలో వర్షాభావం వల్ల ఎండిపోయిన వరిపోలాలను అయన రైతులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈసంవత్సరం వర్షాలు సరిగా కురవకపో వడం వల్ల వేసిన వరి పంటకు నీటి సౌకర్యం లేక చేతికి వచ్చే పంట చేతికి వచ్చే సమయానికి ఎండిపోతున్నా యని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఎకరానికి దాదా పు రూ.3000 పెట్టుబడి పెట్టిన అన్నదాతలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది అన్నారు. ప్రభుత్వం ఎండిపోయిన పొలాలను వ్యవసాయ అధికారుల చేత సర్వే చేయించి నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం సభ్యులు తాళ్లూరు ఉద్దండు, రైతులు సిమట సాయి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మూలపాడులోని మూలపాడు జిల్లా పరిషత్ హై స్కూల్లో 1993 -94 వ సంవత్సరపు విద్యార్థులు తమ చిన్ననాటి స్నేహితులతో ఉపాధ్యాయులతో గేట్ టు గెదర్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చిన్ననాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆ పాఠశాల ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘన సన్మానం నిర్వహించారు. అనంతరం తమ అపూర్వ కలయికలో భాగంగా విద్యార్థులు తమ పూర్వపు స్మృతులను కుటుంబసభ్యులతో చేరి నెమరు వేసుకున్నారు.

అర్చకుడికి నివాళి అర్పిస్తున్న సామినేని

అర్చకుడికి నివాళి

పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థాన ప్రధాన అర్చకులు మర్రేబోయిన.వెంకట రమణ అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఆదివారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దీవెన ఫౌండేషన్ సభ్యులు

దీవెన ఫౌండేషన్ ఆర్థికసాయం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సింగినగర్‌కు చెందిన హర్షిత్ (12) ప్యాంక్రియాస్ మరియు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో అతనికి ఆపరేషన్ నిమిత్తం దీవెన పౌండేషన్ మానవత్వంతో ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందజేసింది. వివరాల్లోకి వెళ్తే సింగ్‌నగర్ నివాసితుడు రమేష్ కుమారుడు హర్షిత్ కిడ్నీ సంబంధిత వ్యాధితో కొన్నాళ్లుగా ఇబ్బందులు పడుతున్నాడు. తండ్రి రమేష్ చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిసుంటాడు. కుమారుడి ఆపారేషన్ కోసం సంబంధిత కుటుంబం దీవెన ఫౌండేషన్‌ను కలువగా వారి తరపున రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని గ్రూప్ సభ్యులు త్రీ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ రాధాకష్ణ, సింగినగర్ కానిస్టేబుల్ చందు బాబు ఇంటికి వెళ్లి ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. పేదవారికి ఆపదలో ఉన్నవారికి సహాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులకు తల్లిదండ్రులు కతజ్ఞతలు తెలిపారు.

కరపత్రం పంచుతున్న దృశ్యం

చిల్లకల్లులో 'బాబుతో నేను'

జగ్గయ్యపేట : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు మండలంలోని చిల్లకల్లు గ్రామంలో 'బాబుతో నేను' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీరాం రాజగోపాల్ వైసీపీ ప్రభుత్వం చేస్తున్నటువంటి అరాచకాలను, ప్రభుత్వ వ్యతిరేక విధానాలను కరపత్రాలలో ముద్రించి ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ :పాడి రైతు కుటుంబాల ఆర్థికాభివృద్ధే కృష్ణామిల్క్ యూనియన్ లక్ష్యం అని చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు.హనుమాన్ జంక్షన్ క్లస్టర్ పరిధిలోని సీతారామపురం పాల సొసైటీ నందు పాడిరైతులకు 2,52,380 రూపాయల బోనస్‌ను చలసాని అందజేశారు. ఈ సర్భంధంగా చలసాని మాట్లాడుతూ పాడిరైతులకు లీటరు పాలధర అందికంగా చెల్లించడంతో పాటుగా ఏడాదికి మూడుసార్లు బోనస్ అందిస్తున్న సంస్థ కష్ణామిల్క్ యూనియనే అన్నారు. పాడిరైతుల సంక్షేమంతో పాటుగా పాడిరైతుల సంరక్షణపట్ల యూనియన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, పశువు ఆరోగ్యంగా ఎదుగుదలకు అవసరమైన దాణా సబ్సిడీపై అందించడంతో పాటు, వ్యాధుల బారిన పడకుండా వైద్య సహాయం అందించటం, కల్యాణ మస్తు, క్షీరబందు, వంటి పథకాలతో రైతులకు అండగా ఉండటంతో పాటుగా పాడిరైతుల కుంటుంబాలకు చెందిన విద్యార్థుల చదువులు సజావుగా సాగేందుకు ప్రతిభ పథకంలో విద్యార్థికి రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించటం జరుగుతుందన్నారు. అనంతరం చైర్మన్ చలసాని ఆంజనేయులుకి పుష్పగుచ్ఛం అందించి సాలువాలతో పాడి రైతులు సర్కరించారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు పర్వతనేని రమేష్ , పాలక వర్గ సభ్యులు, పాల ఉత్పత్తి దారులు, సూపర్ వైజర్ బావిశెట్టి వెంకటేశ్వరరావు, సెమెన్ వర్కర్ , తదితరులు పాల్గొన్నారు .

ఆంజనేయులను శాలువాతో సత్కరిస్తున్న పాల సొసైటీ సభ్యులు

పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కోడూరు : అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, వైఎస్సార్సీపీ రైతు విభాగం జోనల్ ఇన్చార్జీ కడవకొల్లు నరసింహారావు సహాకారంతో పాదాల వారిపాలెంలో నాల్గవ నెంబర్ పంటకాలువ పూడికతీత పనులను కోడూరు మండల వైఎస్సార్సీపీ నేతలు ఆదివారం ప్రారంభించారు. రత్నకోడులోని నీటిని కాలువలోకి మళ్లించేందుకు అవసరమైన మూడు మోటర్లను కూడా రమేష్ బాబు, నరసింహారావులు రైతులకు అందించారు. సుమారు 300 ఎకరాలకు ఉపయోగపడేలా ఈ పనులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండలం జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ముళ్లపూడిలో 'బాబుతో నేను'

ప్రజాశక్తి-పమిడిముక్కల : నారా చంద్రబాబునాయుడు అరెస్టు వైయస్ జగన్మోహన్‌రెడ్డి అవినీతి పాలనకు నిదర్శనమని పామర్రు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా అన్నారు. ఆదివారం మండలంలోని ముళ్ళపూడి గ్రామంలో 'బాబుతో నేను' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందన్నారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, లింగంలేని రామారావు, ఉండి విజయ సారథి, కాకాని సుధారాణి, కొల్లూరు బాబ్జి, శిల్వి బాబు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు కష్టకాలం

ప్రజాశక్తి - గన్నవరం : గన్నవరం మండలంలో సాగుకు అవసరమైన వర్షం లేదు. ఖరీఫ్ సాగుదార్లు అయోమయంలో ఉన్నారు. రుతు పవనాలు వెనక్కి పోవడంతో సరైన వర్షాలు లేక వరి నార్లు ఎండుతున్నాయి. మెట్ట గ్రామాల్లోని 60 సాగు నీటి చెరువుల్లో 40 చెరువుల్లో చుక్కనీరు లేక ఖాళీగా ఉన్నాయి. పోలవరం నుండి మోటార్లతో నీటిని మళ్లిస్తారని ఎదురు చూస్తున్నారు. అయితే విద్యుత్ సరఫరా సమస్యగా మారింది. విద్యుత్ శాఖకు డబ్బులు కడితేనే కనెక్షన్లు ఇచ్చే పరిస్థితి ఉంది. ప్రభుత్వం మోటార్లకు విద్యుత్ సరఫరా చేయడానికి ఆదేశాలు ఇచ్చినట్లుగా వైసిపి నాయకులు చెబుతున్నా ఆపనులు జరగడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 17 వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఏలూరు కాలువ కింద ఉన్న ఏడు గ్రామాల్లో ఏడు వేల ఎకరాల్లో వరి వేస్తారు. కాలువకు నీ రు విడుదల చేశారు. నీరు పంట కాలువలకు ఎక్కాలంటే మరింత పెంచాలి. కానీ తక్కువగా నీ రు విడుదల చేయడంతో రైతులు సాగునీటి కష్టాలను పడుతున్నారు. కళ్ళముందే పైరు ఎండిపోతుండడంతో కన్నీరు పెడుతున్నారు. వర్షాలు బాగ పడి చెరువులతో పాటు కుంటలు, పొల్లాలో నీరు వస్తే రైతులు పూర్తిగా పనుల్లోకి దిగుతారు. లేకుంటే మెట్ట పైర్లు వేయడం తప్ప మరొకటి ఉండదు. ముస్తాబాద, సూరంప ల్లి, గొల్లనపల్లి, చిక్కవరం, తెంపల్లి గ్రామాల్లో చెరువులకు పోలవరం నీరొస్తే నాట్లు పడతాయని సాగుదార్లు చెప్పారు. నారు మడులు ఎండిపోతుండటంతో వాటిని కాపాడు కునేందుకు నీరు లేక అవస్థలు పడుతున్నారు. విత్తనాల కొరతను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం పట్టిసీమకు నీరొదిలింది. కష్ణాకు నీరుచేరడంతో కిందకు వదులుతుంది. రైతులు సాగు చేసుకోవాలని చెబుతోంది.

నీరు లేకుండా సాగు కష్టమే : తిరుపతయ్య,

నీరు లేకుండా వరి సాగు కష్టమే. కాలువకు నీరు వదిలినా పంట కాలువకు ఎక్కడం లేదు. వె నాటార్లతో పెట్టాలంటే ఖర్చు అధికమవు తోంది. ఆయిల్ ఖర్చు పెరగడంతో ఇంజన్ల ఖర్చు పెరిగింది. ఎకరాకు రెండు వేలు దాకా నీటి ఖర్చు అవుతుంది. వర్షాలు పడితేనే రైతుసాగు చేయడాని కి వీలుంటుంది.

ఈసారి రైతులకు ఆదిలోనే ఇబ్బందులు : పిచ్చియ్య,

ఈసారి ఆదిలోనే రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. విత్త నాల కొరతతో అవస్థలు పడ్డాం. సాగు నీటి కొరత వెంటాడుతోంది. కాలువకు పూర్తి స్థాయిలో నీరు రాలేదు. చెరువుల్లో రు లేదు. సాగుఏవిధంగా జరుగుతుందో తెలియడం లేదు. ఏలూరు కాలువకు పూర్తి స్థాయిలో నీ రు వదిలితే కొంత ఉపయోగం ఉంటుంది.

చెరువులన్నీ పోలవరం నీటితో నింపాలి : కైలే ఏసుదాసు

వర్షాలు పడని కారణంగా మెట్ట గ్రామాల్లోని చెరువులన్నీ పోలవరం నీటితో నింపడానికి ప్రభుత్వ 0 చర్యలు తీసుకోవాలి. మోటార్లకు వి ద్యుత్ సరఫరా ఇవ్వాలి. అందుకు అయ్యే ఖర్చు ప్రభుత్వ మే భరించాలి. చెరువుల్లోకి నీరు రాకుండా సాగు జరగదు. ఇప్పటికే నెల రోజులు ఆలస్యమవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పోలవరంనీరు చెరువుల్లోకి వస్తే సాగు చేపడతారు. కాలువ కింద గ్రామాల్లో పంట కాల్వలకు నీరెక్కాలా నీరు విడుదల చేయాలి. రైతుల ఇబ్బం దులు తొలగించడానికి చర్యలు తీసుకోవాలి.

సాగునీటి కోసం ఉద్యమిస్తాం

- మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్

మాట్లాడుతున్న బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : సాగునీటి సంక్షోభం నెలకొల్పిన రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో రైతులకు శాపంగా మారిందని సాగునీటి కోసం టిడిపి జనసేన ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం నాగాయలంక మండల పరిధిలోని కమ్మనమోల సెంట్రల్ ఛానల్ 3 ఏ పరిధిలో ఎండిపోతున్న వరి పొలాలు పరిశీలించారు. సాగునీటి అధికారులు ఎమ్మెల్యే ఈ ప్రాంతానికి వచ్చి రైతులకు భరోసా కల్పించిన దాఖలాలు లేవన్నారు గత ప్రభుత్వంలో సాగునీటి కొరత ఏర్పడిన సమయంలో అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు అండగా ఉండేవారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుకు రైతులు గోడు పట్టదని కనీసం ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించాలన్న ఆలోచన కూడా లేదన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతంలో రైతులను కాపాడుకోవడం ప్రజాప్రతినిధుల ప్రథమ కర్తవ్యం అని, కానీ ఇక్కడ ప్రజాప్రతినిధి వ్యవసాయాన్ని విస్మరించి రైతును రక్షించకుండా ప్రశ్నించిన వారిని కొట్టడానికి సిద్ధంగా ఉన్నాడని అన్నారు. భూమి నెర్రలు ఇచ్చి రైతులు దిక్కుతోచని స్థితికి చేరారని, ఇటువంటి పరిస్థితుల్లో వంతును పెంచి చివరి భూములకు నీళ్లు అందించాలని కోరారు. చివరి భూముల వరకు సాగునీటిని అందించకపోతే ఉభయ పార్టీల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సాగునీరు వచ్చి 20 రోజులు పైగా అయిందని పలుకుబడి ఉన్న వారు కొందరు ముందుగా సాగునీటిని తమ పొలాలకు మళ్ళించుకుంటున్నానని నోరులేని రైతులు మాత్రం కాల్వగట్లపై కూర్చొని నీళ్లు ఎప్పుడు వస్తాయని ఎదురుచూడాల్సి వస్తోందని పలువురు రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, రైతు నాయకులు బావిరెడ్డి వెంకటేశ్వరరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు

డయాలసిస్ సెంటర్లో పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

డయాలసిస్ సెంటర్ పరిశీలన

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాల లో ఏర్పాటు అవుతున్న డయాలసిస్ సెంటర్ ను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు శనివారం రాత్రి పరిశీలించారు. ఆరు పడకలతో ఆరో ప్లాంట్ సౌకర్యంతో ఏర్పాటు చేస్తున్న డయాలసిస్ సెంటర్ ను ఎమ్మెల్యేతో పాటు కష్ణా గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావు పరిశీలించారు. అతి త్వరలో ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజిని చేతుల మీదుగాప్రారంభిస్తామని తెలిపారు. ఈ డయాలసిస్ సెంటర్లో ఉన్న బెడ్స్ మిషన్స్ పరికరాలు ఫర్నిచర్ నాణ్యత ప్రమాణాలతో ఉండాలని సంబంధిత అధికారు లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల సోషల్ మీడియా కో కన్వీనర్ పే రే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగితే చర్యలు

ప్రజాశక్తి-బంటుమిల్లి : కృష్ణాజిల్లా ఎస్పి జాషువా ఆదేశాలు మేరకు నెల రోజుల నుండి బహిరంగ ప్రదేశాలలో పొగతాగేవారికి చలానా వేధిస్తు న్నట్లు బంటుమిల్లి ఎస్ఐ పైడి బాబు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగిన వారికి, విద్యాలయాలు, దేవాలయాలకు 100 గజాల్లోపు పొగాకు ఉత్పత్తుల అమ్మే వారిపై, 18 సంవత్సరాల లోపు పిల్లలకు పొగాకు అమ్మే వారిపై స్మోకింగ్ యాక్ట్ ప్రకారం చలానా విధిస్తామన్నారు.

చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగం

ప్రజాశక్తి- గన్నవరం : మండల పరిధిలో 21 గ్రామ పంచాయతీలో ప్రభుత్వం చెత్త నుండి సంపద కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించి వీటి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. గన్నవరం , బుద్దవరం, కేసరపల్లి, ముస్తాబాద మేజర్ పంచాయతీలున్నాయి. వీటిలో సంపద కేం ద్రాలకు నిధులు మంజూరు చేశారు. కేసరపల్లిలో 13 లక్షలతో నిర్మాణం చేయగా, మిగిలిన చోట్ల 3 నుండి 6 లక్ష లతో కేంద్రాలు నిర్మాణం చేశారు. మొత్తం వీటి నిర్మాణానికి రూ.1.80 కోట్లు ఖర్చు చేశారు. గన్నవరం కేసరపల్లి, సావర గూడెం సహా 15 పంచాయతీల్లో కేంద్రాల నిర్మాణాలు పూర్తయ్యింది. గన్నవరంలోని కేంద్రం నిరుపయోగంగా మారింది. చెత్త నుండి సందప రావడం లేదు. నిర్మించిన కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. కానీ ఇంత వరకు వినియోగంలోకి రాలేదు. నాలుగు రోజులు కంపోస్టు ఎరువు త యారు చేసి సరిపెట్టారు. తర్వాత దీనిని పట్టించుకున్న నాధుడు లేరు. 3 లక్షల వ్యయంతో తాటాకులో పైకపు వేసి దీనిని నిర్మించి నిధులు దుర్వినియోగం చేశారు. ఈదురు గాలులకు తాటాలకులు లేచి పోయాయి. ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుతుంది. తలుపులు చెదలు పట్టి ఊడిపోయ నాయి. ఇంత ఖర్చు పెట్టి నిర్మించిన కేంద్రం అధికారులు నిర్లక్ష్యం వల్ల నిరుపయోగంగా తయారైంది. కే సరపల్లిలో సంపద కేంద్రం రూ.13 లక్షల వ్యయంతో నిర్మించిశ్రీవ దీనిని అందుబాటులోకి తీసుకురావడం లేదు. చెత్తను తీసుకొచ్చి తగులబెడుతున్నారు. రహదారిపై వెళ్లే వారికి అసౌకర్యం కలుగుతోంది. ఇదిలా ఉంటే సారవగూడెం కేంద్రం నిరుపయోగంగా ఉంది. మిగతా పంచాయతీ నిర్మాణాలు పూర్తయినా ప్రారంభించకపోవడంపట్ల జనాలు నిరసన తెలిపారు. కొన్ని చోట్ల నిర్మాణాలు సాగుతూనే ఉన్నాయి. దీంతో పంచాయతీల్లో ఎక్కడ చూసినా చెత్త సమస్యే కనిపి స్తోంది. అందుబాటులో సంపద కేంద్రాలను ఎందుకు ఉపయోగించుకోవ డం లేదో తెలియడం లేదు. లక్షలు వ్యయం చేసి లక్ష్యాన్ని గాలికి వదిలేశారని జనాలు మండిపడుతున్నారు. చెత్తను ఎక్కడ పోసి నిప్పు పెడుతున్నారు. దీంతో పొగ, విషయవాయులతో ఇబ్బందులు పడుతు న్నారు. సంపద మాట పక్కన పెడితే కనీసం చెత్త ను లేకుండా చేయాలనే ఆలోచనకు విఘాతం కలుగ తోంది. ఇప్పటికైనా అధికారులు రంగంలోకి దిగి చెత్త నుండి సంపద కేంద్రాలను అందుబాటులోకి తీ సుకురావాలని కోరుతున్నారు.

యాత్రికుల రద్దీ

బస్సు తాళాలను దుర్గగుడి ఛైర్మన్, ఇఒకు అందజేస్తున్న కెనరా బ్యాంక్ సర్కిల్ మేనేజర్ రవి వర్మ

దుర్గగుడికి బస్సు వితరణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా ఆదివారం కెనరా బ్యాంక్ యాజమాన్యం దుర్గాష్టమి రోజున యాత్రికులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు వీలుగా రూ.24 లక్షల విలువ గల నూతన బస్సును శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి అందజేశారు. కెనరా బ్యాంకు సర్కిల్ జనరల్ మేనేజర్ పి.రవి.వర్మ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు చేతుల మీదుగా దుర్గగుడి ఈవో కేఎస్ రామారావుకి బస్సు అందజేశారు. భవానీ ఘాట్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ కర్నాటి రాంబాబు, బ్యాంకు ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు, శాసనసభ్యులు శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఆలయానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యం కోసం కెనరా బ్యాంకు కార్పొరేటు సామాజిక బాధ్యతగా బస్సును అందించడం ఆనందించదగ్గ విషయమని.. ఇందుకు కెనరా బ్యాంకు యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దేవస్థానం కమిటీ సభ్యులు

ఘనంగా శరన్నవరాత్రులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దసరా శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు దసరా ఉత్సవాల ఎనిమిదవ రోజైన ఆదివారం శ్రీదుర్గాదేవి అలంకారంతో దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే దేవస్థానం యాత్రికులతో కిటకిటలాడింది. అమ్మవారిని ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శాంతి దర్శించుకుని పట్టు చీరను సమర్పించారు. ఆమెకు దేవస్థానం పాలకవర్గం స్వాగతం పలికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ అనురాధ, తెలుగుదేశం నాయకులు నాగుల్ మీరా, పెందుర్తి శ్రీనివాస్ తదితరులు అమ్మవారిని దర్శించుకోగా వారిని ఆలయ కమిటీ సముచిత రీతిన సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ మాట్లాడారు. రోజూ వేలాదిమంది అమ్మవారిని దర్శించుకుంటున్నారన్నారు. దసరా ఉత్సవాల కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి ఉపాధ్యక్షులు మరుపిళ్ళ సత్యనారాయణ, బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు పొట్నూరి దుర్గాప్రసాద్, శీరం వెంకట్రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొరగంజి భాస్కరరావు, కార్యవర్గ సభ్యులు పోతిన బేసికంటేశ్వరుడు, పాల్గొన్నారు.

నందిగామ : నందిగామ పట్టణం 3వ వార్డులో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని నందిగామ శాసన సభ్యులు మొండితోక జగన్ మోహన్‌రావు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నందిగామ పట్టణంలో 18 వ వార్డులో దసరా శరన్నవ రాత్రుల్లో కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహానికి నందిగామ శాసన సభ్యులు మొండితోక జగన్ మోహన్‌రావు శనివారం రాత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను విగ్రహ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. 3వ వార్డు కౌన్సిలర్ ఖాలీక్, 18వ వార్డు కౌన్సిలర్ భండారు గంగానమ్మ, నందిగామ సొసైటీ ఛైర్మన్ పాములపాటి రమేష్, వైసీపీ నియోజక వర్గ నాయకులు యార్లగడ్డ సత్య నారాయణ ప్రసాద్, పారుపల్లి హరి, భండారు వెంకట్రావు, ప్రజా ప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నందిగామ 16వ వార్డు కనక దుర్గమ్మ దేవాలయంలో ఆదివారం రాత్రి కోలాటం పలువురిని ఆకట్టుకుంది. మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కోలాటం నత్యం ప్రజలను ఉత్సాహ పరిచింది. నందిగామ మండలంలో దేవి శరన్నవ్రత ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. దసరా ఉత్సవాల పురస్కరించుకొని ఎనిమిదో రోజు ఆదివారం అంబారుపేట శ్రీ సత్యమ్మ అమ్మవారు శ్రీ కనకదుర్గదేవిగా, పల్లగిరి గట్టుపై త్రిశక్తి పీఠంలో త్రిమాతలకు కనకదుర్గదేవిగా ప్రత్యేక అలంకరణలు విశేష కుంకుమార్చనలు మూలమంత్ర హోమాలు పూజలు నిర్వహించారు. నందిగామ పట్టణం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో సుఖ శ్యామల అమ్మవారు, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి శ్రీ చక్ర మందిరంలో శ్రీ వాసవి మాత, మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలలో మహాలక్ష్మి దేవి కనక దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చింది. **వత్సవాయి :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు శ్రీ దుర్గాదేవి గా దర్శన మిచ్చారు. వత్సవాయిలో వత్సవాయి అమ్మ తల్లి దేవాలయం, లింగాల ఉమామహేశ్వర దేవాలయం, చిట్యాల శ్రీ వెంకటేశ్వర దేవాలయం, మక్కపేట ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం, మంగొళ్ళు రామాల యం దేవాలయం, భీమవరం ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద భక్తులే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్య క్రమాలు నిర్వహిం చారు. ప్రతి రోజు అమ్మవారికి కట్టిన వస్త్రాలను రాత్రి సమయంలో పూజలు అయిన తర్వాత వేలంపాటలు నెరవేస్తు న్నారు. వేలంపాట ద్వారా చీరలను సొంతం చేసుకుంటున్నారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. వత్సవాయి గ్రామంలో మహామేరు శ్రీచక్ర వాసవి కన్యకా పరమేశ్వరి దేవి సహిత నవ ఉప ఆలయముల క్షేత్ర ప్రాంగణంలో శ్రీదేవి శరన్నవ రాత్రోత్సవంలో భాగంగా ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా అత్యంత వైభవోపేతంగా శ్రీ చండీ హోమం నిర్వహించారు.

దర్శించుకుంటున్న ఎంఎల్‌ఎ

చండీహోమం చేస్తున్న దృశ్యం

కంచికచర్ల : దసరా ఉత్సవాలు ఆదివారం 8వ రోజు ఘనంగా నిర్వహించారు. స్థానిక పశువుల ఆస్పత్రి రోడ్లో ఏర్పాటు చేసిన కనకదుర్గ విగ్రహాన్ని దుర్గాదేవిగా అలం కరించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక వసంత కాలనీలో విగ్రహాన్ని దుర్గాదేవిగా అలంకరించారు. ఈ సంద ర్భంగా అన్న దానం చేశారు. గని ఆత్కూరు, పరిటాల, మోగులూరు, గొట్టుముక్కల, కీసర తదితర గ్రామాల్లో విగ్రహాలను అలంకరించి పూజలు నిర్వహించారు.

పూజలు చేస్తున్న దృశ్యం

మైలవరం : దసరా శరన్నవ రాత్రుల్లో భాగంగా స్థానిక కోట వెనుక ఉన్న కోట మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారి నీ ఆదివారం 200 మంది సువాసినీలచే సామూహిక గౌరీ ఆరాధన జరిగింది. పూజల అనంతరం 108 రకాల ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరిం చారు. **ఇబ్రహీంపట్నం :** దేవీ నవరాత్రులను పురస్క రించుకుని కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద కొండపల్లి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గుంజ శ్రీనివాసు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో శ్రామిక నగర్‌లో కనకదుర్గ అమ్మవారి దేవాలయం వారు ఏర్పాటు చేసిన విగ్రహానికి, దుర్గా గణేష్ కమిటీ వారు ఏర్పాటు చేసిన విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం కొండపల్లిలో మహాలక్ష్మి బొడ్డురాయి సెంటర్ యూత్ ఏర్పాటు చేసిన విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుంజ శ్రీనివాసు అన్నసంతర్పణకు వారి సొంత నిధులతో కనక దుర్గమ్మ గుడికి రూ.10 వేలు, దుర్గా గణేష్ కమిటీకి రూ.10 వేలు, మహాలక్ష్మి అమ్మవారి బొడ్డు రాయి సెంటర్ యూత్ వారికి రూ. 10వేలు అంద జేశారు. ఈ కార్య క్రమంలో ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంద్ర కొండ గురవయ్య, కొండ పల్లి మున్సి పాలిటీ అధ్యక్షులు మిక్కిలి శరభయ్య, కౌన్సిలర్ అడపా వెంకయ్య నాయుడు, పార్టీ నాయకులు కుమ్మరి శ్రీనివాసరావు, వి.సురేష్ ఆంజనేయులు పాల్గొన్నారు.

శ్రీ దుర్గాదేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనం

ఆదివారం కావడంతో భారీగా తరలివచ్చిన జనం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం శ్రీ దుర్గాదేవిగా దుర్గమ్మ దర్శనమిచ్చారు.

అమ్మవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

దుర్గాదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను పలువురు ప్రముఖులు దర్శించు కున్నారు. మంత్రి కారుమూరి నాగేశ్వర రావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్ర కుమార్, ఎపిఎస్‌పిఎఫ్ ఐజి టి.వెంకటరామి రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి అరుణ సారిక, హైకోర్టు న్యాయమూర్తులు కెవిఎల్ఎన్ఎస్ చక్రవర్తి, బి. కృష్ణమోహన్, ఎన్. విజయ, భానుమతి తదితర ప్రము ఖులు అమ్మవారిని దర్శించుకున్న వారిలో వున్నారు. రాష్ట్రంలో ప్రజలందరూ సర్వసంపదలతో సుభిక్షంగా ఉండేలా జగన్మాతను కోరుకున్నానని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. దుర్గాదేవి అవతారంలో దర్శనమిస్తున్న జగన్మాతను దర్శించుకునేందుకు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి వచ్చిన ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించి, అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకోవటానికి వచ్చిన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు

హైకోర్టు న్యాయమూర్తి కెవిఎల్ఎన్ఎస్ చక్రవర్తికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

హైకోర్టు న్యాయమూర్తి భానుమతికి అమ్మవారి ఆశీర్వాదం అందజేస్తున్న దృశ్యం

దర్శనానికి విచ్చేసిన ఏపీఎస్‌పిఎఫ్ ఐజి టి. వెంకట రామిరెడ్డి

దుర్గమ్మను దర్శించుకోవటం అదృష్టం : అచ్చెన్నాయుడు

ఆశీర్వాదం అందుకుంటున్న అచ్చెన్నాయుడు

వన్‌టౌన్ : దేవి శరన్నవ రాత్రుల్లో అత్యంత ముఖ్యమైన రోజు దుర్గాష్టమి రోజున అమ్మ వారిని దర్శించు కోవడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని ఏపీ టీడీపీ అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం ఇంద్రకీలాద్రి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ "అమ్మవారిని దర్శించుకుని మనస్ఫూర్తిగా రెండు విషయాలు అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు. ఎన్ని కేసులు బనాయించిన కడిగిన ముత్యంలాగా చంద్రబాబు బయటకు వస్తారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శరన్నవరాత్రులు

కొండ పల్లి మున్సి పాలిటీలో వేంచేసి యున్న వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ వారి శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహి స్తున్నారు. దేవి నవ రాత్రులను పురస్క రించుకుని కొండపల్లి వైసిపి ప్రతి నిధులు కొండపల్లి శ్రీ చెన్న కేశవ రామా లయంలో వేంచేసి ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ వారిని దర్శించుకుని వేద ఆశీర్వ చనం తీసుకున్నారు. ఈ కార్య క్రమంలో మునిసిపల్ చైర్మన్ అభ్యర్థి గుంజ శ్రీనివాస్, కౌన్సిలర్స్ కుమ్మరి శ్రీనివాసు, అడపా వెంకయ్య నాయుడు, వైసిపి టౌన్ ప్రెసిడెంట్ మిక్కిలి శరభయ్య, జిల్లా జనరల్ సెక్రటరీ కాంద్ర కొండ గురవయ్య, దేవాలయ కమిటీ ఛైర్మన్ పల్లపోతు బ్రహ్మజీ పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శన

జగ్గయ్యపేట: మండ లంలోని బలుసు పాడు శ్రీ గురుదా ధర్మ క్షేత్రంలో శరన్నవ రాత్రి ఉత్స వంలో భాగంగా ఆదివారం శ్రీసత్యా కూచిపూడి డాన్స్ అకాడమీ ఆధ్య ర్యంలో చిన్నారుల నాట్య ప్రదర్శన జరిగింది. శివశ్రీ గెంటేల వెంకట రమణ, వసంత లక్ష్మీ దంపతులు నత్యం చేసిన చిన్నా రులకు బాలా రాధన చేసి సత్కరించారు. అకాడమీ నిర్వాహకులు రామకృష్ణ, కష్ణవేణి దంపతులను సత్కరించి అభినం దించారు. మండలం లోని మల్కాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్య క్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రీరాం రాజగోపాల్ పాల్గొన్నారు. అన్నదానాన్ని ప్రారంభించారు. **పెనుగంచిప్రోలు :** స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయంలో గల శ్రీ అంకమ్మ అమ్మవారి ఆలయ వెండి తాపడం తయారు నిమిత్తం కుక్కపల్లి. చెన్నకేశవ రావు 50, 116 రూపాయలు కష్ణాజిల్లా ఉయ్యూరు మండలం కడవకొల్లు గ్రామ వాస్తవ్యులు యాదవ రెడ్డి హరికష్ణ ప్రసాద్ కష్ణ జ్యోతి దంపతులు అన్నదాన పథకానికి రూ.10,116లు ఆలయ కార్య నిర్వహణ అధికారి డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్ నాయుడు సూచనల మేరకు ఆలయ ఏఇఒ తిరుమలేశ్వరరావు ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కష్ణమోహన్‌కు విరాళమిచ్చారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనంతీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఫిట్స్ వచ్చిన చిన్నారికి చికిత్స

వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఎనిమిదో రోజు శ్రీ దుర్గాదేవి అలంకారంలో దుర్గమ్మ దర్శన మిచ్చారు. అయితే దుర్గగుడికి అమ్మవారి దర్శనం కోసం ఆదివారం కుటుంబ సభ్యులతో విచ్చేసిన ఓ చిన్నారికి క్యూ లైన్‌లో ఫిట్స్ రావడంతో వెంటనే చికిత్స అందించేందుకు పాలకమండలి ఛైర్మన్ కర్నాటి రాంబాబు తగిన ఏర్పాట్లను చేశారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : సామాజికవేత్త, పారిశ్రామిక వేత్త అయిన బొమ్మ రెడ్డి వెంకటరెడ్డి 63వ పుట్టినరోజు వేడుకల సందర్భంగా గరికపర్రు, తోట్లవల్లూరు గ్రామంలో 600 వద్ధులకు అన్నదానం తో పాటు వస్త్రదానంచేశారు. బి.వి.ఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పుట్టినరోజు వేడుకలకు ముఖ్య అతిథిగా పమిడిముక్కల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. కిషోర్ బాబు, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్ రెడ్డి, ఎంపీపీ ఈడుపు గంటి రాజమణి, పార్టీ అధ్యక్షుడు కళ్ళం వెంకటేశ్వరరెడ్డి, మండల సచివాలయల కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, సర్పంచ్ వెంకట రెడ్డి, పోట్లూరి గోపాల కష్ణ, నాగమల్లేశ్వరరావు, బీవీఆర్ యువత సభ్యులు వీరంకి రాము, బొలెం కోటేశ్వరరావులు పాల్గొని కేక్ కట్ చేశారు. సామాజికవేత్త అయిన బొమ్మ రెడ్డి వెంకట్ రెడ్డి గ్రామాన్ని దత్తత తీసుకుని అనేక అభివద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో పలు పేద కుటుంబాలను ఆదుకుని ఆర్థిక సహాయం అందించడంలో ఆయన ముందున్నారు, గ్రామంలో అనేకమంది బి.వి.ఆర్ యువతగా ఏర్పడి ఆయన చేసిన మంచి పనులకు ఆసక్తులై స్వచ్ఛందంగా పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సహాయం అందజేస్తున్న శ్యాం కిషోర్‌నాయుడు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లికి చెందిన కోట సతీష్ ఇటీవల పక్షవాతానికి గురయ్యాడు. సతీష్ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని స్థానికులు తెలపడంతో శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు ఆదివారం పరామర్శించి మూడువేల రూపాయల ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. అల్లం శెట్టి చలం, పసుపులేటి లీలా ప్రసాద్, ముస్లిం మైనార్టీ నాయకులు పటాన్ కరిముల్లా ఖాన్, శ్రీనివాస చౌదరి, కోట అంజిబాబు తదితరులు పాల్గొన్నారు

మైత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం లోని స్తానిక నవీన్ మిట్టల్ కాలనీలో ఆదివారం జరిగిన మెగా వైద్య శిబిరంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో పది రూపాయల డాక్టర్ గా ప్రసిద్ధిగాంచిన డాక్టర్ నూరి పర్వీన్ సుమారు 350 పైగా ప్రజలకు వైద్య సేవలు అందించారు. జిల్లా రవాణా అధికారి పి. సీతాపతిరావు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో మచిలీపట్నం మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డా.డి ఆశాలత గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక అతిథులుగా గూడవల్లి నాగరాజు పాల్గొ న్నారు. ఉదయం10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అనేక మంది ప్రజలు దూర ప్రాంతాల నుండి కూడా వచ్చి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు మైత్రి ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు ఏ ఆర్ కె వర ప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు అందరూ కూడా మైత్రీ ఫౌండేషన్ సేవలను కొనియాడారు. అనంతరం డా.నూరి పర్విన్ మాట్లాడుతూ మైత్రీ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న కార్యక్రమాలు తనను విశేషంగా ఆకట్టుకున్నాయని ఇక పై కూడా తన సహకారం ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ తోట సత్యనారాయణ డా. అబ్దుల్ ఖాజా, జె సీ ఐ ప్రెసిడెంట్ కష్ణ భాస్కర్, మరియు మైత్రీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ నూరిపర్వీన్

వేమవరంలో ఘనంగా గ్రామోత్సవం

గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అన్నదానం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రులలో భాగంగా ఆదివారం అమ్మవారి గ్రామోత్సవం రంగరంగ వైభవంగా జరిగింది 40 వేల మంది భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. శ్రీశ్రీ కనకదుర్గా దేవిగా(దుర్గాష్టమి) అలంకరణ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శ్రీ అమ్మవారికి అభిషేకం అనంతరం శ్రీ అమ్మవారికి నిత్యార్చన, సహస్ర కుంకుమార్చన, సమస్త కాలసర్పదోష, విజయాభివద్ధికి దుర్గా హవనములు నిర్వహించారు. దర్శనం అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఈ గ్రామోత్సవం వేమవరం, నాగవరం, రెడ్డిపాలెం, వడ్లమన్నాడు, పద్మాలపాలెం, కౌతవరంలలో గ్రామోత్సవం జరిగిందని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్. పార్టీ అధికారి ప్రతినిధి దుక్కిపాటి శశిభూషణ్ దంపతులు, గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి , వైస్ ఎంపీపీ శాయన రవి కుమార్ , మాజీ చైర్మన్ పెన్నేరు ప్రభాకర్ రావు , దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు , ధర్మకర్తల మండలి అధ్యక్షులు శేషం వీర వెంకట కష్ణ మూర్తి దంపతులు కొండలమ్మ ఆలయ, రిటైర్డ్ ఈవో జక్కా ధర్మారాయుడు మరియు సభ్యులు పామర్తి వెంకట స్వామి దంపతులు, కొమ్మనబోయిన రవి శంకర్, , వలూరు వెంకటరావు, బాడిగ లీలా సౌజన్య , నారెపాలెం వెంకట నిర్మల పాల్గొన్నారు. అనంతరం శ్రీ అమ్మవారి దేవస్థానంలో అన్నప్రసాద వితరణ సుమారు 40వేల మందికి నిర్వహించారు. ఈ అన్నదానంలో జిల్లా నలు మూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం అందజేత : కొండలమ్మ అమ్మవారి దేవస్థానం లో భక్తులకు అన్నదాన నిమిత్తం ఈశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు వర్ధ పూర్ణ గంగాధర్ 50, 116 రూపాయలు కార్యనిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు, చైర్మన్ శేషం వీర వెంకట కష్ణమూర్తి కి ఆదివారం అందజేశారు.

బాబోయ్ కోతులు

- ఇళ్లలోకి చొరబడి వస్తువుల అపహరణ
- తరిమితే దాడులు
- భయందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : బాపులపాడు మండలంలో కోతుల బెడదతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఇళ్లలోకి వస్తున్న కోతులతో ప్రజలు, ముఖ్యంగా మహిళలు, వద్ధులు భయంతో వణికిపోతున్నారు. బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలోని కుమ్మరి కాలనీలో కోతుల బెడద రోజురోజుకు ఎక్కువవుతుంది. కోతులు గుంపులు, గుంపులుగా బయలుదేరి కాలనీలో విరుచుకుపడుతున్నాయి. ఇళ్లు, దుకాణాలలో ఉన్న తినుబండరాలు, నిత్యవసర సరుకులు, వస్తువులను ఎత్తుకెళ్లడంతోపాటు ప్రజలపై దాడులకు దిగుతూ గాయపరుస్తున్నాయి. కోతుల భయంతో ప్రజలు ఇళ్ల నుండి బయటకు వచ్చేందుకు భయపడే పరిస్థితి ఏర్పడింది. ఇటీవల వీరవల్లి గ్రామంలోని కుమ్మరి

రహదారిపై గుంపులుగా కోతులు

కోతుల దాడిలో గాయాలు

కాలనీకి చెందిన రమాదేవి అనే మహిళ ఇంట్లో పనులు చేసుకుంటూ ఉండగా, ఒక్కసారిగా ఆమెపై కోతులు మూక దాడి చేసి భుజంపై గాయపరిచాయి. రమాదేవి కేకలు వేయడంతో గమనించిన స్థానికులు కోతులను చెదరగొట్టడంతో ఆమె ప్రమాదం నుంచి బయటపడింది. ప్రతిరోజూ ఉదయాన్నే కోతుల గుంపుగా కిటికీలు ధర నివాసాల్లోకి వెళ్ళి ఇంట్లోని పప్పు, బియ్యాన్ని, ఇతర పదార్థాలను లాక్కెళు తున్నాయి. కోతులను తరమాలంటే గుంపుగా పైన పడుతుండడంతో భయంతో హడలిపోతున్నారు. కాలనీవాసులు పొరపాటున పనికి వెళితే వారు తిరిగి వచ్చే లోపు ఇంట్లో వస్తువులను చిందరవందరగా చేస్తున్నాయని వాపోయారు. చిన్నారులు సైతం విధుల్లోకి రావాలంటే అడలిపోతున్నారని అన్నారు.కోతులు దాడి చేస్తున్న సమయంలో భయంతో పరుగులు పెడుతూ పడిపోయి దెబ్బలు తగిలిన వారు కూడా పలువురు ఉన్నారని స్థానికులు తెలిపారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా, తమ గోడు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కోతుల నియంత్రణలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని. కోతుల నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మిద్దెల మీద గుంపులు గుంపులుగా ఒకచోట చేరి వచ్చి పోయే వారిపై దాడి చేస్తున్నాయని కోతుల బెడద తీవ్రం కావడంతో కొంత మంది టపాసులు, పెద్ద శబ్దాలు చేసి వాటిని తరిమేస్తున్నామని తెలిపారు. గత కొంతకాలంగా ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. పంచాయితీ అధికారులు దష్టి పెట్టి కోతులను బందించి గ్రామ నుంచి అటవీ ప్రాంతాలకు తరలించాలని, కోతులు బెడద నుండి తమకు విముక్తి కలిగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సాంబయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : విద్యుత్ ట్రాన్స్ఫారం పేలిన ఘటనలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయిన సినిమా థియేటర్ కార్మికుడు పసుపులేటి సాంబయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి బాబు ప్రభుత్వాన్ని కోరారు. విద్యుత్ ట్రాన్స్ఫారం పేలిన దుర్ఘటనలో తీవ్రంగా గాయపడి మరణించిన సాంబయ్య కుటుంబ సభ్యులను ఆదివారం సురేష్ బాబు కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ సాంబయ్య కు ప్రభుత్వం అందచేసే వైఎస్ఆర్ భీమా నగదు తో పాటు విద్యుత్ శాఖ తరుపున నష్టపరిహారం అందేలా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. సాంబయ్య భార్యకు ఔట్సోర్సింగ్ ద్వారా ఉద్యోగం ఇచ్చేలా చూడాలని కోరారు. సాంబయ్యకు రావాల్సిన భీమా మరియు ఎక్సగ్రేషియా త్వరగా చెల్లించేలా చూడాలని అధికారులను కోరారు. ఈకార్యక్రమంలో నేతలు ఎం.శంకర్రావు, ఎం. వెంకటేశ్వరరావు,జి. కోటేశ్వరరావు, విఆర్వో పసుపులేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన దీక్ష

ప్రజాశక్తి-ఉయ్యూరు : చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు, రిమాండ్కు నిరసనగా కలవపాములలో టీడీపీ శ్రేణులు ఆదివారం రిలేదీక్ష చేపట్టారు. దేవినేని గౌతమ్, స్మిత దీక్షాశిబిరాన్ని సందర్శించి దీక్షలో ఉన్నవారికి సంఘీభావం తెలిపారు. వెల్లంకి వెంకటేశ్వరరావు, సురేంద్ర, పామర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులందరికీ బోనస్ చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి-గన్నవరం : బోనస్ చట్టం 1965 ప్రకారం ప్రతి కంపెనీలోని పర్మినెంట్, క్యాజువల్, కాంట్రాక్టు కార్మికులందరికీ దసరా సందర్భంగా యాజమాన్యాలు బోనస్ చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్ళం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బోనస్ అనేది వాయిదా పడిన వేతనం, సెక్షన్ 31 ప్రకారం బోనసు హక్కుగా ప్రతి కార్మికులందరూ పొందవచ్చు అన్నారు. లాభ, నష్టాలతో నిమిత్తం లేకుండా యజమానులు బోనస్ చెల్లించాలని, నష్టాలు వచ్చినా కనీస బోనసు నెల జీతంగా (8.33 శాతం) చెల్లించాలన్నారు. ఉత్పత్తిలో లాభాల్లో కార్మికుల వాటా కూడా ఉంటుందని కనుక లాభాలు వచ్చిన కంపెనీలు 20 శాతం వరకూ బోనస్ చెల్లించాలన్నారు. బోనస్ చట్టం కార్మికుల పక్షన బలమైన చట్టం ఎమర్జెన్సీ కాలంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం ఎల్.ఐ.సి ఉద్యోగులకు బోనస్ 4 శాతానికి తగ్గించిందన్నారు.కాని సుప్రీంకోర్టు తిరిగి బోనస్ ను నెల జీతంగా బకాయిలతో సహా ఇప్పించిందని బోనస్ చెల్లించని యజమానులకు జైలుకు కూడా పంపిందని చెప్పారు. కార్మికులకు బోనస్ వెంటనే చెల్లించాలని సిఐటియు ఏపీ కమిటీ డిమాండ్ చేస్తున్నదనీ మీ యాజమాన్యాలు బోనస్ను చెల్లించకపోతే చెల్లించమని కార్మికులందరూ డిమాండ్ చేయాలన్నారు. కార్మికులకు సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు.

నేడు 'స్పందన' రద్దు

ప్రజాశక్తి-విజయవాడ : విజయదశమి సందర్భంగా సోమవారం (ఈ నెల 23వ తేదీ) విజయవాడ నగరపాలక సంస్థలో స్పందన కార్యక్రమం లేదని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ...ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వాటి పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే "స్పందన" కార్యక్రమాన్ని దసరా పండగ సందర్భంగా సోమవారం రద్దు చేసినట్లు కమిషనర్ తెలిపారు. నగర ప్రజలు ఈ గమనికను గుర్తించాలని ఆయన కోరారు.

డిసెంబర్‌లో టిడ్కో గృహాల పంపిణీ

- 3,239 గృహాలకు రిజిస్ట్రేషన్ పూర్తి
- మౌలిక వసతుల కల్పనకు చర్యలు
- ఎసిజి, యుసిడి పిఒ శకుంతల

ప్రజాశక్తి-విజయవాడ

అన్ని రకాల మౌలిక వసతులను ఏర్పాటు చేయడంతో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి వచ్చే డిసెంబర్‌లో లబ్ధిదారులకు టిడ్కో గృహాల పంపిణీ ఉచేయనున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి అదనపు కమిషనర్ (జనరల్), పిఒ-యుసిడి కె.శకుంతల పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, నగరపాలక సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా టిడ్కో గృహాల కేటాయింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేయడానికి వేగంగా అన్ని రకాల పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. షాబాద్-జక్కంపూడి పరిధిలో మొత్తం 6,576 టిడ్కో గృహాలను పూర్తి చేసి సంబంధిత లబ్ధిదారులకు కేటాయించాల్సి ఉందన్నారు. టిడ్కో గృహాలు, విఎంసి చేపట్టిన పనులు గురించి ఆమె 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: టిడ్కో గృహ నిర్మాణం తీరు, లబ్ధిదారులకు వాటి కేటాయింపు ఎప్పటి లోపు పూర్తి అవుతుంది?

రాష్ట్ర ప్రభుత్వం, విజయవాడ నగరపాలక సంస్థ డైరెక్షన్ ప్రకారం రాబోయే డిశంబర్ నాటికి టిడ్కో గృహ నిర్మాణ స్కీమ్‌ను పూర్తి చేసి, సదరు లబ్ధిదారులకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగానే సెకండ్ ఫేజ్ కింద ఇంకా పూర్తి కావాల్సిన ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన నిధులను బ్యాంక్‌ల లోను సదుపాయం కల్పించి స్కీమ్‌ను పూర్తి చేయడానికి విఎంసి పాలకవర్గం, నగర కమిషనర్ కసరత్తు చేస్తున్నారు. స్కీమ్ మొత్తం 6,576 గృహాలకు గాను నిర్మాణాలు పూర్తి అయిన 3,239 గృహాలను సదరు లబ్ధిదారుల పేరుతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగింది. ఇంకా మిగిలిన గృహాల నిర్మాణాలు పూర్తి అయ్యే కొద్దీ వాటినీ కూడా లబ్ధిదారుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంటుంది. దాదాపుగా సగం మిగిలిపోయిన గృహాల నిర్మాణాలను పూర్తి చేస్తూనే, మౌలిక వసతులయిన రహదారులు, మంచినీరు, విద్యుత్, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాల కోసం వర్క్సును కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది.

ప్రశ్న: నగరపాలక సంస్థ పరిధిలో ఇటీవల కొత్తగా ఎన్ని పెన్షన్స్ మంజూరు అయ్యాయి?

ఆయా ప్రాంతాల్లో అప్లై చేసుకున్న 4,200 దరఖాస్తులను పరిశీలించి, అర్హులయిన 3,400 మందికి వివిధ సామాజిక పింఛన్లను మంజూరు చేయడం జరిగింది. 67,660 మంది వివిధ సామాజిక పింఛన్ల దారులకు రూ.18 కోట్ల 96 లక్షలను ప్రతి నెలా మొదటి తారీకున పంపిణీ చేస్తున్నాం.

ప్రశ్న: స్వయం సహాయక గ్రూపు (ఎస్‌హెచ్‌జి)ల బలోపేతానికి తీసుకుంటున్న చర్యలు?

ఎస్‌హెచ్‌జి గ్రూపు సభ్యులు స్వయంశక్తితో ఆర్థికంగా అభివృద్ధి సాధించడంతో పాటు నగర ప్రజలకు వివిధ రూపాల్లో సహాయ సహకారాలు అందించాలనే సదుద్దేశ్యంతో విఎంసి ఒక కొత్త కార్యక్రమాన్ని ఇటీవలనే అమలు చేసింది. పెరిగిన ధరల నేపథ్యంలో...ఎక్కడయితే జనం రద్దీగా ఉండి, వ్యాపార కూడళ్లగా ఉన్న ప్రదేశాలను ఎంపిక చేసి, అక్కడ "ఆహా" పేరుతో సామాన్య, దిగువ మధ్యతరగతి ప్రజలకు సరసమైన అతి తక్కువ ధరకు రుచికరమైన, శుభ్రమైన ఆహార పదార్థాల చిన్నపాటి క్యాంటిన్ టైప్‌లో ఎస్‌హెచ్‌జి గ్రూపు మహిళల ద్వారా నిర్వహించడం జరుగుతుంది. రూ. 30లకు పెరుగన్నం (కర్డ్ రైస్) విక్రయించడం జరుగుతుంది. నగర పరిధిలోని మూడు సర్కిల్స్‌లోని మ్యాంగోమార్కెట్ (సర్కిల్-1), సింగ్‌నగర్ అమెరికన్ హాస్పిటల్ (సర్కిల్-2), ఎపిఐఐసి కాలనీ (సర్కిల్-3) సెంటర్లలో "ఆహా" క్యాంటిన్‌ను ప్రారంభించడం జరిగింది. ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్న వీటితో పాటు ప్రభుత్వ వైద్యశాల, రైల్వే ష్టేషన్ తదితర ప్రదేశాల్లో కూడా వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇటువంటి సెంటర్ల ద్వారా పేద, దిగువ మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరలకు రుచికరమైన, శుభ్రమైన ఆహార పదార్థాలను అందించడంతో పాటు మహిళలకు కొంత వరకు ఉపాధి అవకాశం ఉంటుందని విఎంసి నిర్వహిస్తుంది.

ప్రశ్న: ఔత్సాహికులైన మహిళలకు కుట్టుమిషన్ల శిక్షణ ఎంత వరకు నడుస్తుంది?

మహిళలు చేతి వృత్తిద్వారా స్వయంశక్తితో ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి విఎంసి కుట్టుమిషన్ల ద్వారా లేటెస్ట్ డిజైన్లు, వివిధ రకాల మోడల్స్‌ను, అల్లికలను మహిళలకు నేర్పించడానికి కమ్యూనిటీ హాల్స్‌లో వీటిని ఏర్పాటు చేస్తున్నాం. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీ (సర్కిల్-2), 56వ డివిజన్ (సర్కిల్-1) తదితర సెంటర్లలో కుట్టుమిషన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. సెంటర్‌కు 12 మిషన్ల కేటాయించి, 30 మంది మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. మొదటి ఫేజ్ కింద నగర వ్యాప్తంగా 500 మందికి ఇటువంటి శిక్షణ ఇవ్వాలని టార్గెట్‌గా నిర్ణయించాం.

ప్రశ్న : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమలు పరుస్తున్న "జగనన్న ఆరోగ్య సురక్ష" కార్యక్రమం ఎలా అమలు జరుగుతుంది?

ఈ కార్యక్రమంలో నగరంలో ఎంతో బాగా నడుస్తుంది. ప్రస్తుతం వైద్యం ఖర్చులు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజల వద్దకే వైద్యం అనే పేరుతో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో దీనిని నిర్వహించడం జరుగుతుంది. ప్రస్తుతం ప్రతి డివిజన్ పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది. అనారోగ్యాలతో ఇబ్బందులు పడుతున్న ప్రతి ఒక్కరూ దీనిని వినియోగించుకొని వారి ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలి.

ప్రముఖుల దసరా శుభాకాంక్షలు

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నగర పోలీసు కమిషనర్ కాంతిరాణాటాటా నగర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం వారు వేర్వేరుగా ఒక ప్రకటన విడుదల చేస్తూ...దసరా పండుగను నగర ప్రజలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని కోరారు. విజయదశమి పండుగ ఆశ్వీయుజ మాసంలోని శుక్లపక్షం పదవ రోజున జరుపుకునే ప్రధాన పండుగలలో ఒకటని పేర్కొన్నారు. మహిషాసుర విజయానికి గుర్తుగా అశ్వమేధయాగం తరువాత ఈ పండుగను జరుపుకుంటారని, దుర్గామాత విజయానికి ప్రతీకని అన్నారు. అలాగే నగర డిప్యూటీ మేయర్లు బెల్లందుర్గ, అవుతు శ్రీశైలజ, ఎపిఐడిసి చైర్‌పర్సన్, కార్పొరేటర్ బండినాగేంద్ర పుణ్యశీల, ఎన్‌టిఆర్ జిల్లా ప్రజారవాణా అధికారి యంవై దానం తదితర అధికారులు నగర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

బియ్యం అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు

అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కార్డుదారులకు కిలో కందిపప్పు, అరకిలో పంచదార రాయితీపై అందిస్తాం జిల్లాలో లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు 516 మెట్రిక్ టన్నుల కందిపప్పు, 208 టన్నుల పంచదార అవసరం.

ప్రశ్న: రేషన్ బియ్యం అక్రమ రవాణా నియంత్రిస్తున్నారా?

రేషన్ బియ్యం అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. సమాచారం ఆధారంగా అక్రమంగా బియ్యం నిల్వ చేసిన గోదాములపై దాడులు నిర్వహిస్తున్నాం. కేసులు నమోదు చేస్తున్నాం. ఈ ఏడాది 10 నెలల కాలంలో రూ. 76, 96, 474 అక్రమంగా రవాణా చేస్తున్న 3,892 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్ చేశాం. 57 కేసులు నమోదు చేశాం.

నేడు రెండు అలంకారాలు

దుర్గామల్లేశ్వరస్వామి వార్లకు కృష్ణానదిలో తెప్పోత్సవం నిర్వహించనున్నారు. తెప్పోత్సవం సందర్భంగా దుర్గగుడి నుంచి గంగా పార్వతీ సమేత దుర్గామల్లేశ్వరస్వామి వార్లను పల్లకిలో ఊరేగింపుగా మల్లేశ్వరాలయం మెట్ల మార్గం నుండి దుర్గాఘాట్‌కు తీసుకువస్తారు. తెప్పోత్సవం అనంతరం ఉత్సవ మూర్తులను జమ్మిదొడ్డి వద్దకు తీసుకువచ్చి అక్కడి నుంచి వన్‌టౌన్ పోలీసులకు అప్పగిస్తారు.

తెప్పోత్సవం ట్రయల్ రన్ విజయవంతం

దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో కీలక ఘట్టమైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల తెప్పోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నదీ విహారానికి సర్వం సిద్ధమయ్యాయి. ఆదివారం సాయంత్రం దుర్గా ఘాట్ వద్ద ట్రైల్ రన్‌ను అధికారులు నిర్వహించారు. దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు, రహదారులు, భవనాలు, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ హంస వాహనంపై తెప్పోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. కరోనా, వరదల కారణంగా మూడేళ్ల పాటు తెప్పోత్సవం జరగలేదని, ఈసారి అన్ని జాగ్రత్తలు తీసుకొని తెప్పోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. బోటు సామర్థ్యం మేరకు మాత్రమే సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా తెలిపారు. దుర్గాఘాట్ సామర్థ్యం ఎనిమిది వందల వరకు ఉంటుందని, ఆ మేరకు మాత్రమే అనుమతించడం జరుగుతుందని వివరించారు. రాష్ట్ర విపత్తు స్పందన దళ బృందాలను కూడా మోహరించనున్నట్లు వెల్లడించారు. ట్రయల్ రన్ కార్యక్రమంలో ఇఒ కెఎస్ రామారావు, జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెప్పోత్సవం ట్రయల్ రన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

చివరి భూములకు అందని సాగునీరు

ఎండిపోతున్న మాగాణి పంట

ప్రజాశక్తి-నందిగామ

శనగపాడు సప్లై ఛానల్ ద్వారా తాత్కాలిక మరమ్మతులు చేపట్టి మున్నేరు నుండి సాగునీరు విడుదల చేసినప్పటికీ, ఎగువ ప్రాంతంలో అక్రమ మోటార్ల ద్వారా నీటి చౌర్యం జరుగుతుండటంతో చివర భూములకు సాగునీరు అందటం లేదు. దీంతో అనాసాగరం, నందిగామ గ్రామాల రైతులు నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నారు. సాగునీటి ఎద్దడితో రైతుల మధ్య వాగ్వాదాలు జరుగుతున్నాయి. అక్రమ మ్మెటార్ల కనెక్షన్‌లు తొలగించటానికి కొంతమంది వ్యక్తులతో అవగాహన ఉండటంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుకు రావడం లేదని చివరి భూముల రైతులు ఆరోపణలు చేస్తున్నారు. శనగపాడు సప్లై ఛానల్ కింద రెండు వేల ఎకరాలు సాగు అవుతుండగా, వెంకటాపురం సెనగపాడు గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు సుమారు 90 మోటార్ల వరకు బిగించుకొని అక్రమ పద్ధతిలో కాలవలు ద్వారా పంటలకు సాగునీరు పెట్టుకుంటున్నారు. నందిగామ, అనాసాగరం గ్రామాల పరిధిలో సుమారు 500 యకరాలకు సాగునీరు అందక మాగాణి, పత్తి, మిర్చి పంటలు ఎండిపోతున్నాయి. సాగునీరు కోసం రైతులు రాత్రింబవళ్లు నిద్రాహారాలు పోలాలలోనే కాలయాపన చేస్తున్నా అధికారులకు ఏ మాత్రమూ పట్టడం లేదు.

ఇంజన్ల ద్వారా నీరు తరలింపు

పత్తి, మిర్చి, మాగాణి పంటలకు పలుమార్లు తడిసిన క్రిందకు సాగునీరు రానివ్వకుండా దిగువ రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. అక్రమ మోటార్ కనెక్షన్లు తొలగించడంలో పిడబ్ల్యుడి అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని, దీనివల్ల తమ భూములకు నీరు రావటం లేదు దిగువ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనాసాగరం గ్రామానికి చెందిన దిగు రైతులు కనగాల వెంకటనారాయణ, శ్రీనివాసరావు మాట్లాడుతూ సుమారు 25 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టి నారుమడులు వేసి 15 రోజులు దాటిన చుక్క నీరు రాలేదని తమ పంటలు ఎండిపోతున్నాయని అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని వాపోవడం జరిగింది. మిర్చి పంటలకు లక్షల రూపాయల వ్యయంతో పెట్టుబడులు పెట్టి ఈ ఏడాది తీవ్రంగా నష్టము పోవటం జరిగిందని తెలిపారు. శనివారం రైతు సంఘాల నాయకులు కాలువలపై పర్యటించి దిగువ రైతుల బాధలను తెలుసుకొని ఆందోళన వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. కౌలు రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు పిడబ్ల్యుడి ఇరిగేషన్ నందిగామ మండల ఇంజనీర్ ప్రశాంతికి ఫోన్ చేసి నందిగామ, అనాసాగరం గ్రామాలకు చెందిన రైతులు ఇబ్బందులు వివరించారు. శనగపాడు సప్లై ఛానల్ పై ఉన్న అనధికారిక 90 అక్రమ మోటార్ కనెక్షన్లు తాత్కాలికంగా తొలగించి వారబందీ పద్ధతి ప్రకారం దిగవ రైతులకు సాగునీరు వచ్చేలాగా సహకరించాలని సూచించారు. ఇరిగేషన్ ఎఇ ఇ ప్రశాంతి మాట్లాడుతూ తాము నిరంతరం కాలువలపై పర్యటించి అక్రమ మోటార్ కనెక్షన్లు తొలగించేందుకు కృషి చేస్తున్నామని సత్వరమే దిగువ ప్రాంతాలకు కూడా సాగునీరు వచ్చేలాగా తమ వంతు పని చేస్తున్నామని చెప్పారు.

బాపులపాడు మండలంలో...

గుడివాడలో...

ఆలయాల్లో దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-గుడివాడ : విజయదశమిని పురస్కరించుకుని దేవి శరన్నవరాత్ర మహోత్సవాలు 8వ రోజు ఆదివారం అమ్మవారు పలు దేవలయాలలో శ్రీకనక దుర్గాదేవి రూపాలలో దర్శనమించారు. స్థానిక బంటు మిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వరస్వామివారి దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్ర మహెూత్సవాలల్లో భాగంగా అమ్మవారు శ్రీకనకదుర్గా అవతారంలో దర్శినమిచ్చారు. ప్రతేకంగా దేవలయంలో మహా చండీ హోమం నిర్వహించారు. దేవస్థానం అభివృద్ధి కమిటి చైర్మన్ చందరాల హరిరాంబాబు, కార్యనిర్వహణాధికారి షణ్యగం నటరాజన్, కమిటీ సభ్యుల నేతృత్వంలో అమ్మవార్కి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే స్థానిక గౌరీశంకరపురంలో వేంచేసియున్న శ్రీ గౌరీశంకరస్వామి వారి దేవస్థానములో శ్రీకనకదుర్గాదేవిగా భక్తులకు దర్శినమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానము అభివృద్ధి కమిటి చైర్మన్ పంచకర్ల వెంకట్, సభ్యులు, షణ్యగం నటరాజన్, పట్టణ ప్రముఖులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. అలాగే గుడివాడలో వేంచేసియున్న శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానములో శ్రీ దేవి శరన్నవరాత్ర మహెూత్సవలల్లో భాగంగా అమ్మవారు శ్రీ కనకదుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మ వార్కి విశేషపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అభివృద్ధి కమిటి చైర్మన్ దుడ్డు చిన్నా, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు),ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ :**బాపుల పాడు మండలం మల్లవల్లి గ్రామంలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏనిమిదవ రోజు జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అమ్మవారిని దుర్గామాతగా అలంకరించారు. ఉదయం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకష్ణారావు, రంగన్నగూడెం ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ, రైతు నాయకులు కసుకుర్తి అర్జునరావు తదితరులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాల కష్ణారావు మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాల్లో దుర్గాదేవిని దర్శించుకోవడం వల్ల అమ్మవారు యాత్రికులకు దుర్గతులు పోగొట్టి సద్గతులను ప్రసాదిస్తుందని, దివ్య రూపిణీ అయిన దుర్గమ్మ దర్శనం సకల శ్రేయోదాయకం అని భక్తుల నమ్మకం అన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు యనమదల వెంకయ్య రావు, సభ్యులు అక్కినేని కృష్ణాజి, ఆలూరు వెంకయ్య చౌదరి, పోలవరపు బాపయ్య ఏర్పాట్లును పర్యవేక్షించారు. వీరవల్లిలోని శ్రీ గంగా పార్వతీ సమేత కొండేశ్వర స్వామి దేవస్థానం నందు దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో సందర్భంగా ఆదివారం పార్వతీ అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కుందుర్తి మురళీ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి గణపతి పూజ , మహ్యా నాస ఏకాదశ పూర్వక రుద్రాభిషేకం అమ్మవారికి విశేష పూజలు సహస్ర నామ కుంకుమార్చనలు, నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. సహస్ర నామ కుంకుమార్చనలో లంక రవి శ్రీనివాస్,శ్రీలక్ష్మి దంపతులచే పూజ కార్యక్రమాలు నిర్వహించారు. విజయదశమి సందర్భంగా గణపతి పూజ , మహ్యానాస ఏకాదశ పూర్వక రుద్రాభిషేకం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు కుందుర్తి మురళీ శర్మ తెలిపారు. వీరవల్లి, కొత్తపల్లి, రంగయ్యప్పారావుపేట, కోడూరుపాడు, కాకులపాడు, గ్రామాలలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారి ప్రత్యేక పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** మండలంపరిధిలోని మంగళాపురంలో టీఎస్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి చంద్ర వెంకటేశ్వరరావు స్వగహంలో జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రి మహెూత్సవాల్లో భాగంగా మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆదివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గత కొన్నేళ్లుగా వెంకటేశ్వరరావు స్వగహంలో అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, పార్టీ నేతలు మండలికి స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో టీడీపీ నేతలు పరుచూరి కమలాకరరావు, రావెళ్ల విజయ్, చంద్ర పిచ్చియ్య, చంద్ర వెంకటేశ్వరరావు, డొక్కు నాగబాబు, దిరిసం వెంకట్రావ్ పాల్గొన్నారు. అలాగే స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మ వారి ఆలయంలో శ్రీ దేవి శరవ్వన రాత్రి మహెూత్సవల్లో భాగంగా ఆదివారం అమ్మవారు మహిషాసుర మర్థిని అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కొల్లిపర మధు, కార్యదర్శి అన్నవరపు పాండురంగారావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో నగర సంకీం ్తన, పల్లకి సేవ నిర్వహించారు. **ప్రజాశక్తి-గన్నవరం :** పాత గన్నవరం లోని తిరుపతమ్మ ఆలయంలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ మహిషా సుర మర్దనిగా దర్శనమిచ్చారు. టిడిపి జాతీయ నాయకులు పట్టాభి, ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు లు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక కార్యక్రమాలు జరిపారు. పట్టణంలోని వందలాది మంది మహిళలు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** శరన్నవరాత్రి ఉత్సవాల్లో వివిధ ఆకతుల్లో అమ్మవారి రూపం ఉట్టిపడేలా అలంకరిచడం సోమేశ్వరరావుకు వెన్నతో పెట్టిన విద్యఅని పలువురు ప్రముఖులు కొనియాడారు. ఉయ్యూరులో శ్రీజగదంబా సమేత సోమేశ్వరస్వామి ఆలయంతో పాటు పలు చోట్ల జరిగే శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రతినిత్యం వివిధ రూపాల్లో అమ్మవారిని అలంకరించి భక్తులకు నయనానందం, భక్తి పారవశ్యాన్ని కలిగిస్తూ 50 సంవత్స రాలుగా ఆధ్యాత్మిక సేవలందిస్తున్న అర్చకుడు మామిళ్ల పల్లి సోమేశ్వరరావును ఇంటర్నేషనల్ బ్రాహ్మిన్ పార్లమెంట్(ఐబీపీ) సంస్థ ఆధ్వర్యంలో సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినవహి ప్రసాద్ ఆదివారం స్థానిక శివాలయం ఆవరణలో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా ఆలయ పాలకమండలి చైర్మన్ చిందా వీరవెంకట కుటుంబరాజు హా జరై సోమేశ్వ రరావు కళా సేవలను అభినందించారు. చావలి రాం బాబు, మామి ళ్లపల్లి పిచ్చేశ్వరరావు, మల్లిఖార్జు నరావు, శ్రీనివాసరావు, సుబ్రమణ్యం, అర్జునరావు పాల్గొని సోమేశ్వరరావుకు అభినందనలు తెలియజేశారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ఎంఎల్‌ఎ కార్యాలయం ముట్టడి తగదు : వైసిపి

ప్రజాశక్తి-కోడూరు : అమాయకులైన జనసైనికులను ముందు పెట్టి టిడిపి నాయకులు వెనకాల ఉంటూ అవనిగడ్డలో టిడిపి కొత్త రాజకీయాలు చేస్తుందని, అమాయకులైన జనసైనికులు, యువత, టిడిపి నాయకుల మాటలు విని ఎమ్మెల్యే కార్యాలయ ముట్టడి కార్యక్రమాలు చేయడం సరైన పద్ధతి కాదని, అవనిగడ్డ రాజకీయ చరిత్రలో ఎంతవరకు ఎప్పుడు కూడా ఈ విధంగా జరగలేదని కోడూరు మండల వైసిపి నేతలు అన్నారు. ఆదివారం జడ్పిటిసి యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ నివాసం వద్ద ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో పలువురు వైసీపీ నేతలు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో కూడా అవనిగడ్డ లో గెలిచేది ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబే అని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి, పేదల జీవితాలు వెలుగులు నింపుతున్నారని వారు తెలిపారు. అవనిగడ్డలో జనసేన పార్టీ నాయకులు ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టడం చాలా బాధాకరమని ఎమ్మెల్యే కార్యాలయం ముందుకు వెళ్లి సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేయడం రెచ్చగొట్టే కార్యక్రమాలు చేశారని, అవనిగడ్డ లో ఇటువంటి సంఘటనలు ఎప్పుడు కూడా జరగలేదని వారు తెలిపారు. ఈ విధంగా జనసైనికులు ముందు పెట్టి టిడిపి నాయకులు కుట్ర రాజకీయాలు చేస్తున్నారని వారన్నారు. అవనిగడ్డ లో గొడవలు సష్టించే విధంగా జనసేన, టిడిపి నాయకులు ప్రవర్తిస్తున్నారని, ప్రజలందరూ కూడా ఈ విషయా లను గమనిస్తున్నారని వారు తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జడ్పిటిసి యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు బడే హేమ గంగాధర్ రావు, తిమ్మన వెంకట నాంచా రయ్య, జిల్లా రైతు నాయకులు కొండవీటి వీర వెంకట నారాయణరావు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై చతుర్వేద పండిత సభ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం రాత్రి చతుర్వేద పండిత సభ జరిగింది. శరన్నవరాత్రుల ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా జరిగిన ఈ సభలో నాలుగు వేదాల పండితులు వేద శ్లోకాల పఠనం చేశారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఏటా సంప్రదాయంగా వస్తున్న ఈ చతుర్వేద పండిత సభలో ఘనాపాటి, క్రమాపాటి వేద పండితుల శ్లోకాలతో ఇంద్రకీలాద్రి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో 100 మంది ఘనాపాటీలకు రూ. 5,000 చొప్పున, 300 మంది క్రమాపాటీలకు రూ. 4,000 చొప్పున పారితోషకాల్ని అందించారు. అదేవిధంగా అమ్మవారి శేష వస్త్రాన్ని, ప్రసాదాలను అందజేశారు. సభాధ్యక్షులకు రూ 6,000 పారితోషకం అంద జేశారు. కార్యక్రమంలో ఈవో కేఎస్ రామారావు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : తమది పేదల పక్షపాతి ప్రభుత్వమని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. శనివారం రాత్రి జగ్గయ్యపేట నియోజకవర్గం, పెనుగంచిప్రోలు యాదవ బజారుకు చెందిన కోలుసు వీరబాబు, బుర్రి హనుమంతరావు, పేట్టేటి కోటేశ్వరి, లింగయ్య, వెంకటేశ్వర్లు 5 కుటుంబాలకు చెందిన 20మంది ప్రతిపక్ష టీడీపీని వీడి అధికార వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సమక్షంలో పార్టీలోకి చేరడం జరిగింది. అనంతరం ప్రభుత్వవిప్ సామినేని ఉదయ భాను పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, గ్రామ అభివద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, మాజీ మండల సమైక్య అధ్యక్షురాలు కందుల త్రివేణి, స్థానిక నాయకులు జంగాల వాసు, వీర్ల నరసింహారావు, ముసిబోయిన సైదులు, మల్లెబోయిన హనుమంతరావు, గోపయ్య, గజ్జి నరసింహారావు, సముద్రాల లక్ష్మణరావు, షేక్ మదర్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-ఎ.కొండూరు : ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండలంలోని వరి మొక్కజొన్న మిరప తదితర పంటలు పండిస్తున్న రైతులు సాగర్ జలాలపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని, దీనికి తోడు ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు సరిగలేక పంటలకు నీరు అందక ఎండిపో తున్నాయని రైతు సంఘం మండల కార్యదర్శి ఆళ్ల అమ్మిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గొల్లమందల రైతు సంఘం కమిటీతో కలిసి ఎండిపోతున్న పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండిపోతున్న పంటలను చూస్తుంటే ఎంతో బాధగా ఉందని సాగర్ జలాల విడుదల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి సాగర్ జలాలను ఎ.కొండూరు మండల ప్రాంతానికి అందజేసి నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలానే నీరు అందక నష్టపోయిన పంట పొలాలకు రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో రైతు సంఘం నాయకులు ఎస్.రామకష్ణారెడ్డి సిఐటియు నాయకులు జెట్టి వెంకటేశ్వరరావు కౌలు రైతు సంఘం నాయకులు ఈ ఆనందరావు బి.మురళీ కృష్ణ అశోక్ రైతులు పాల్గొన్నారు.

వరి పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

దుర్గగుడి ఉద్యోగులకూ తప్పనితిప్పలు

ప్రజాశక్తి-వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 15వ తేదీ నుండి అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు 23వ తేదీ సోమవారం విజయదశమి రోజున దేవాలయంలో పూర్ణాహుతతో దుర్గమ్మ దసరా ఉత్సవాలు ముగియనున్నాయి. అయితే ఉత్సవాల ఎనిమిదో రోజు ఆదివారం శ్రీ దుర్గాదేవి అలంకారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం కావటంతో అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల సమన్వయంతో దసరా ఉత్సవాలు విజయవంతం అవుతాయనేది నగ్న సత్యం. కానీ కొంతమంది పోలీసులు అత్యుత్సాహం మీతిమీరిపోయింది. ఆదివారం దుర్గగుడిలో విధుల్లో ఉన్న కొంతమంది ఉద్యోగులను, అలాగే మీడియా పాయింట్‌కు వెళ్ళాల్సిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు, చానల్స్ కెమెరా మెన్లను ఓం టర్నింగ్ వద్ద పోలీసులు అడ్డగించి, నిలిపేశారు. దీనివల్ల అటు దుర్గగుడి దేవాలయంలో విధుల్లో వున్న సిబ్బంది తాము విధుల్లో భాగంగా వెళ్తున్నామని చెప్పినా వినే పరిస్థితి కనబడలేదు. సి- ఛానల్ కెమెరామెన్ సెల్వరాజ్ ఆదివారం ఉదయం ఇంద్రకీలాద్రిపై విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో దేవాలయం క్రింద కెనరా బ్యాంక్ వారు దుర్గగుడికి ఉచిత బస్సును అందజేస్తుండటంతో కవరేజ్‌కి వెళ్ళి పైకి చేరుకున్నారు. ఓం టర్నింగ్ వద్ద వారి ద్విచక్ర వాహనాన్ని పోలీసులు ఆపివేయటమే గాక, కెమెరామెన్ సెల్వరాజ్ మీడియా పాయింట్‌కు వెళు ్తన్న సమయంలో ఓం టర్నింగ్ వద్ద పోలీసులు అతన్ని అడ్డగించి తోసేశారు. దీంతో అవాక్కైన సెల్వరాజ్ తన మెడలో దుర్గగుడి డ్యూటీ పాస్ ఉన్నా, చేతిలో కెమెరా బ్యాగ్ ఉన్నా తోసేశారు. దీంతో ఆ సమయంలో అక్కడే ఉన్న కొంతమంది మీడియా సిబ్బంది కలుగజేసుకుని పరిస్థితిని పోలీసుల అధికారులకు వివరించారు. సాక్షాత్తు దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ బహిరంగంగానే కొంతమంది పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని మీడియా ముందు చెప్పిన విషయం విధితమే. అయినా పోలీసులు ఇబ్బందులు గురిచేయటంపై విధుల్లో ఉన్న దేవాలయ సిబ్బంది ఆక్షేపిస్తున్నారు.

ఓం టర్నింగ్ వద్ద విధుల్లో వున్న దేవాలయ సిబ్బందిని ఆపేసిన పోలీసులు

కీడాకోల చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ దర్శకుడు తరుణ్ భాస్కర్ హీరోగా నటిస్తూ నిర్మించిన కీడాకోలా చిత్రం నవంబర్ 3న రిలీజ్ కానున్న నేపథ్యంలో ప్రమోషన్‌లో భాగంగా బందర్ రోడ్‌లోని ఒక హోటల్‌లో చిత్ర యూనిట్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. సమావేశంలో దర్శకుడు తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ క్రైమ్ కామెడీ జోనర్‌తో ఈ సినిమాను నిర్మించినట్లు తెలిపారు. ఒక బాటిల్ చుట్టూ జరిగే సన్నివేశాలతో ఈ చిత్రాన్ని తీసినట్లు తెలిపారు. బాటిల్‌కు బొద్దింకకు ఈ కథతో సంబంధం ఏంటి అనేది సస్పెన్స్‌గా ఈ చిత్రం కొనసాగుతుందని తెలిపారు. ఈ చిత్రంలో ప్రముఖ కమెడియన్ బ్రహ్మానందం క్యారెక్టర్ ప్రేక్షకులకు కడుపుబ్బ నవ్విస్తూ సినిమాకి హైలెట్గా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రం ద్వారా పలువురు కొత్త నటీనటులను వెండితెరకి పరిచయం చేస్తున్నామన్నారు. పెళ్లిచూపులు చిత్రాన్ని ప్రేక్షకులు ఎంతగానో ఆదరించాలని అలాగే ఈ చిత్రాన్ని కూడా ప్రేక్షకులు ఆదరించాలని ఆయన కోరారు. అనంతరం నటులు జీవన్, చైతన్య మాట్లాడుతూ దర్శకుడు తరుణ్ భాస్కర్ ఈ చిత్రాన్ని ప్రేక్షకులు కడుపుబ్బ నవ్వుకోవాలని ఉద్దేశంతోనే కీడాకోలా చిత్రాన్ని నిర్మించాలని చెప్పారు. నవంబర్ 3న చిత్రం రిలీజ్ కాదని ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. సినిమాను థియేటర్‌లోనే ప్రేక్షకులు చూడాలని సూచించారు. విలేకరుల సమావేశంలో నిర్మాత సాయి కష్ణ, నటులు రాగ్ మయూరి, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - విజయవాడ : శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ 8వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. గుంటూరు రింగురోడ్డు సిద్ధార్థ గార్డెన్స్ అండ్ కన్వెన్షన్ సెంటర్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీ భ్రమర హౌసింగ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గళ్లా రామచంద్రరావు మాట్లాడుతూ శ్రీ భ్రమర బిజినెస్ అవార్డ్సు - 2023 పేరుతో నిర్వహించిన ఈ వార్షికోత్సవ వేడుకల్లో సంస్థ విజయాల్లో కీలకపాత్ర పోషించిన మార్కెటింగ్ టీమ్స్‌కు అవార్డులను అందచేసి సత్కరించినట్లు తెలిపారు. ఇప్పటివరకు శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ చేపట్టిన, చేపట్టబోతున్న ప్రాజెక్టులను అదరిస్తున్న కొనుగోలుదారులకు, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టించాలనే ఆశయంతో 2015లో ప్రారంభించిన శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ప్రయివేట్ లిమిటెడ్ 30కి పైగా ప్రాజెక్టులతో, 8వేల మందికిపైగా సొంతింటి కల నెరవేర్చినట్లు తెలిపారు. కృష్ణా, గుంటూరు, ఎన్‌టిఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో వేలాది కుటుంబాలకు ఇళ్ళు, ఇళ్ల స్థలాలందించి స్థిరాస్తి రంగంలో తమదైన ముద్ర వేసుకుని 8 ఏళ్ళు పూర్తిచేసుకుని 9వ ఏట అడుగుపెట్టినట్లు తెలిపారు. 9వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న ఈ శుభ సందర్భంగా శ్రీ భ్రమర సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు వ్యాపారంలో సహకరిస్తున్న వ్యాపార సహచరులకు, ఆర్కిటెక్‌లకు, ఇంజనీర్లకు పెట్టుబడిదారులకు, బ్యాంకర్లకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, శైలారెడ్డి కోట, మురళీకృష్ణ యడ్లపల్లి, ఎంపికె లక్ష్మీపతిరాజు, ఎం.ఎస్.రాజు పలువురు పాల్గొన్నారు.

వార్షికోత్సవ వేడుకల్లో జ్యోతిప్రజ్వలన చేస్తున్న దృశ్యం

స్కోడా పండుగ ఆఫర్లు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ప్రీమియం కార్ల తయారీలో అగ్రగామిగా ఉన్న స్కోడా కార్ల కంపెనీ 250 కస్టమర్ టచ్ పాయింట్లకు విస్తరించే మైలురాయికి చేరుకున్నట్లు స్కోడా ఆటో కంపెనీ డైరెక్టర్ పీటర్ తెలిపారు. నగరంలోని స్కోడా డీలర్‌షిప్ నందు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పండుగల సందర్భంగా స్కోడా కార్లపై ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే స్కోడా కార్ల నెట్‌వర్క్ సేవలను అందించే క్రమంలో 250 టచ్ కస్టమర్ పాయింట్లకు విస్తరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిపారు. స్కోడా కార్ల తయారీలో అగ్రగామిగా ఉన్న కుషాన్ ఎస్‌యూవి, స్లావియా సెడాన్, కార్లలో ఆఫర్లు అందిస్తున్నామని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు నగరంలోని స్కోడా డీలర్‌షిప్ నందు సంప్రదించవచ్చని తెలిపారు.

ప్రమాదకరంగా వంతెన

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రంలో దళితవాడను కలుపూ కోతుల వాగుపై నిర్మించిన రెండు వంతెనలు కూడా శిథిలావస్థతో ప్రమాదకరంగా మారి పోయాయి. పడమటి గూడెం వద్ద నిర్మించిన వంతెన ఇప్పటికే శిథిలమై రాకపోకలు నిలిచి పోయా యి. సిఎస్‌ఐ క్రైస్ట్ సమీపంలో కోతుల వాగుపై నిర్మించిన మరొక వంతెన ప్రమాదక రంగా తయారైంది. ఈ వంతెనపై నిరంతరం ప్రజల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ వంతెన రెయిలింగ్ లేకపోవడంతో అగాధం లాంటి లోతైన లోయ ఉండటంతో ఏదైనా జరగరానిది జరిగితే ఏంటని ప్రజలు భయాం దోళనకు గురవుతున్నారు. కనుక అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ వంతెన మరమ్మ తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చిత్రంలో రెయిలింగ్ కూలిన దృశ్యాలు

ఐడిబిఐ బ్యాంక్‌కు అవార్డులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అసోచామ్ తమ 18వ వార్షిక బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సెక్టార్ అవార్డుల కార్యక్రమంలో ఐడిబిఐ బ్యాంకుకు మూడు అవార్డులు సాధించినట్లు బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ సురేష్.కె తెలిపారు. ఎం.జి.రోడ్డులోని బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. బ్యాంక్ మిడ్ సైజ్ విభాగంలో బెస్ట్ డిజిటల్ ఇనిషియేటివ్స్‌లో విజేతగా నిలిచినట్లు తెలిపారు. బెస్ట్ రిస్క్ అండ్ సైబర్ సెక్యూరిటీ ఇనిషియేటివ్స్, బెస్ట్ ప్రొడక్ట్ సర్వీస్‌లో రన్నరప్‌గా నిలిచినట్లు తెలిపారు. అవార్డులు రిజర్వ్ బ్యాంకు మాజీ డిప్యూటీ గవర్నర్ ఎన్.ఎస్.విశ్వనాథన్, అసోచామ్ అధ్యక్షులు జి.రాజ్ కిరణ్‌ల చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. బ్యాంకు ఖాతాదారులకు రానున్న కాలంలో మరిన్ని మెరుగైన సేవలను అందించనున్నట్లు తెలిపారు.

డిజిటల్ ప్రచారం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ప్రముఖ ఐకానిక్ ఆడియో బ్రాండ్ జెబీఎల్ దీపావళి సందర్భంగా సౌండ్ ఫర్ ఎవ్రీ మూడ్ పేరుతో వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జెబీఎల్ సంస్థ ఇన్‌ఛార్జి కె.రామ్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. సంగీత ప్రపంచం గురించి ప్రతి ఒక్కరికీ తెలియచేయడంతో పాటు సంగీత ఉత్పత్తుల్లో తమ సంస్థ ఏవిధంగా అభివృద్ధి చెందుతుంతో ఈ ప్రచారం ద్వారా తెలియచేస్తున్నామన్నారు. 50 రోజుల పాటు డిజిటల్ ప్రచారాన్ని సంస్థ నిర్వహించేందుకు ఇప్పటికే ప్రణాళికలను సిద్ధ ంచేసినట్లు తెలిపారు. సంగీతాభిమానల కోసం వివిధ సంగీత కార్యక్రమాలను కూడా ఈ ప్రచార కార్యక్రమంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.